అలా మొదలై.. ఇలా నిజమై..

- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణం
- అన్ని వసతులూ కల్పిస్తున్న ప్రభుత్వం
- నెరవేరిన పేదల సొంతింటి కల



పాములమెట్ట కాలనీలో శరవేగంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణం



నిర్మాణం పూర్తయిన ఇల్లు

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల సాకారమైంది. దాదాపు 15 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూసిన పేదలకు గత ప్రభుత్వాలు మొండిచెయ్యి చూపించాయి. అద్దె ఇళ్లలో పేదలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన జగన్ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను కేటాయించారు. కడియం మండలం జేగురుపాడు పంచాయతీ పరిధిలోని పాములమెట్ట కాలనీ వద్ద 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో విశాలమైన రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర అన్ని మౌలిక సదుపాయాలతో ప్లాట్లు ఏర్పాటు చేశారు. వీటిలో 2,188 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అలాగే వేమగిరి 1లో 94 మందికి, వేమగిరి 2లో 561 మందికి ఇళ్ళ స్థలాలు కేటాయించారు.

జోరుగా నిర్మాణాలు

మండలంలోని వేమగిరి, కడియపులంక, కడియపు సావరం గ్రామాల పరిధిలోని లబ్ధిదారులకు వేమగిరి 1, 2 లేఅవుట్లలోనూ, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, వీరవరం, మురమండ, దుళ్ల, దామిరెడ్డిపల్లి, పొట్టిలంక పంచాయతీ పరిధిలోని వారికి జేగురుపాడులోని పాములమెట్ట వద్ద ఇళ్ల స్థలాలను జగన్ ప్రభుత్వం అందజేసింది. దీంతో ఆయా లేఅవుట్లలో పేదలు ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

పూర్తిస్థాయిలో వసతులు

లేఅవుట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ స్తంభాలు, లైన్లు వేశారు. లోఓల్టేజీ సంబంధిత సమస్యలు రాకుండా ముందుగానే తగినన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కాలనీల్లో గ్రావెల్ రోడ్లు నిర్మించారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందించనున్నారు. ఇందులో భాగంగా తొలి విడత పైపులైన్ నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇప్పుడు మరో విడత పనులను చురుగ్గా చేస్తున్నారు. ప్రతి ఇంటికీ విద్యుత్ మీటర్లను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తోంది.

గ్రామాలను తలపిస్తున్న కాలనీలు

ప్రస్తుతం కడియం మండలం పరిధిలో పేదలకు ఇచ్చిన లేఅవుట్లు గ్రామాలను తలపిస్తున్నాయి. మండలంలో అతి చిన్న పంచాయతీలుగా ఉన్న గ్రామాల కంటే జేగురుపాడు పాములమెట్ట కాలనీలోని అందించిన ప్లాట్లే ఎక్కువ. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్ల తర్వాత తమకు సొంతిల్లు సమకూరిందన్న ఆనందం లబ్ధిదారుల్లో కనిపిస్తోంది. అలాగే వేగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, గృహప్రవేశాలు చేస్తున్నారు. ఒక పక్క కొత్త నిర్మాణాలు, మరోపక్క గృహప్రవేశాలతో ఈ లేఅవుట్‌లో నిత్యం సందడి నెలకొంటోంది.

కడియం మండలంలో వివరాలు

లేఅవుట్	మొత్తం ఇళ్లు	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
పాములమెట్ట కాలనీ	2,188	450	1,285
వేమగిరి-1	94	17	77
వేమగిరి-2	561	193	368

కల నెరవేరింది



నాకు 20 ఏళ్ల క్రితం పెళ్లయింది. అప్పట్నుంచి ఇప్పటి వరకూ నాకు ఇంటి స్థలం ఇచ్చిన వారే లేరు. సైకిల్‌పై మొక్కలు అమ్ముతుంటాను. సొంత ఇల్లు సాధ్యం కాదేమో అనుకున్నా. కానీ సీఎం వైఎస్ జగన్ పుణ్యమా అని ఇంటి స్థలం వచ్చింది. ప్రభుత్వం రుణం మంజూరు చేసింది. కొంత సొమ్ము సమకూర్చుకుని ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాను. అద్దె ఇంటిలో ఇప్పటివరకూ పడిన బాధలు మర్చిపోయి, సొంతిటిలో హాయిగా ఉంటున్నాం.

–ఎం.ఆనందరావు, పాములమెట్ట లేఅవుట్

క్లుప్తంగా

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు



శంకుస్థాపనలో పాల్గొన్న అడపా శ్రీహరి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు జగన్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, దానిలో భాగంగా ఎంపీ మార్గాని భరత్‌రామ్ సారథ్యంలో చర్యలు చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. నగరంలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. 38వ డివిజన్ కృష్ణానగర్ వినాయకుడి గుడి వెనుక వీధిలో రూ.9 లక్షలతో డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు, సుబ్బరాయపురంతో రూ.6 లక్షలతో హెచ్‌డీ పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 38వ డివిజన్ ఇన్‌చార్జి అరిగెల బాబు, 2వ డివిజన్ ఇన్‌చార్జి మానే దొరబాబు, పార్టీ నాయకులు ఆర్.ఉదయ్ రానా, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాల సందర్శన

కంబాలచెరువు: నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం సందర్శించారు. గౌతమీ జీవకారుణ్య సంఘంలో వృద్ధులను, వారికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఎస్టీ బాలికల వసతి గృహం, ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్, ఎస్టీ బాలురు హాస్టల్, బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు ఇస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఎస్‌కేఆర్‌లో ఒలింపిక్ డే

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి, కళాశాల పీడీ వై.సుధారాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్నేషనల్ ఒలింపిక్ డే థీమ్ 'లెట్స్ మూవ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థినులు క్రీడల్లో రాణించాలని, దానికి అవసరమైన సదుపాయాలు కళాశాలలో పుష్కలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అథ్లెట్ అసోసియేషన్ మెంబర్లు డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, కె.చిన్నిబాబు, జి.దివ్య, ఏ.దేవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్‌డే రన్

ప్రకాశం నగర్: స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో శుక్రవారం ఒలింపిక్‌డే రన్ నిర్వహించారు. డీఈవో ఎస్.అబ్రహం, వీటీ కళాశాల ప్రిన్సిపాల్ రాజాబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్ బొంతా శ్రీహరి, సామ్రాజ్య నాయక్, సుంకర నాగేంద్ర కిషోర్, సీరా గంగాధర్ పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగింపు

కంబాలచెరువు: లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కుంజం భాస్కరరావును విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2010లో భాస్కరరావు రూ.5 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అతడిని ఏసీబీ కోర్టు దోషిగా తేల్చడంతో విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



రాయుడుపాకలు గ్రామంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్ కార్యాచరణ రూపొందించారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆయన శుక్రవారం రాయుడుపాకలు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకూలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. జగనన్న సురక్షలో భాగంగా నెలరోజుల్లో రూరల్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి వెళతామన్నారు. క్యాంపులకు ముందుగా వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా గృహసారథిని వెంట తీసుకుని ప్రతి ఇంటినీ సందర్శిస్తారన్నారు. కొలు గుర్తింపుకార్డులతో సహా పది రకాల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యాక జరిగే క్యాంపుల్లో అక్కడికక్కడే వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు.

ఆణిముత్యాలకు సత్కారం

కడియం: వేమగిరితోట హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం సత్కరించారు. హెచ్‌ఎం లక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.లజపతిరాయ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థినులు మేఘన, అమృతవల్లి, హన్సికకు మెమెంటోలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి రైల్వే స్టేషన్‌లో మొబైల్ ఫోన్ దొంగతనాలు చేస్తున్న చర్చిపేటకు చెందిన ఆముదాల ఆనంద్, షేక్ అమద్ అలీకి విజయవాడ రైల్వే కోర్టు రిమాండ్ విధించిందని జీఆర్పీ ఎస్సై మావుళ్లు తెలిపారు. వారి నుంచి రూ.52 వేల విలువైన మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మత్తు పదార్థాలకు యువత బానిసలు కావొద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ సూచించారు. శుక్రవారం ఎస్ఈబీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

హెడ్ పోస్టాఫీసులో అదాలత్

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ వినియోగదారులు, పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించేందుకు రాజమహేంద్రవరం హెడ్ పోస్టాఫీసు కేంద్రంగా డివిజన్ స్థాయి డాక్ అదాలత్, పెన్షన్ అదాలత్‌ను నిర్వహించినట్లు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధరమ్ తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధి గంగిరెడ్ల కాలనీలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న పోలవరపు నూకరాజును శుక్రవారం మధ్యాహ్నం బొమ్మూరు ఎస్సై జగన్ మోహన్ అరెస్టు చేశారు. అతడి నుంచి 180 ఎంఎల్ 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

విద్యాహక్కును అమలు చేయాలి

కంబాలచెరువు: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలన్నీ విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అర్బన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల కరెస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఐ మాట్లాడుతూ బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విధిగా పొందాలని, డ్రైవర్‌ను నియమించేటప్పుడు అతడి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. వసూలు చేస్తున్నఫీజుల వివరాలను విధిగా నోటీసుబోర్డులో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో అర్బన్ రేంజ్ మండల విద్యాశాఖాధికారి 2 రమా రజని పాల్గొన్నారు.

కేసు కొట్టివేత

రాజమహేంద్రవరం రూరల్: కోవిడ్ విధుల్లో భాగంగా ఆవరోడ్డు వాంబే గృహాల దగ్గర విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు అంజూరి విజయ కుమార్, రాయుడు శ్రీనివాసరావు మీద పైలా సతీష్, పైలా లక్ష్మణరావు అనే కార్మికులు ఇటుకలతో దాడి చేసి, విధులకు ఆటంకం కలిగించారనే కేసును ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న కొట్టివేశారు. ఈ కేసులో పోలీసులతో సహా మొత్తం ఆరుగురు సాక్షులను విచారించి, పై విధంగా తీర్పుఇచ్చారు. నిందితుల తరపున ముప్పాళ్ల సుబ్బారావు వాదించారు.

తొమ్మిది నెలల జైలు

కంబాలచెరువు: రెండు వేర్వేరు దొంగతనాల్లో నేరం రుజువు కావడంతో వేమగిరి సత్తిబాబుకు తొమ్మిది నెలలు జైలు శిక్ష విధిస్తూ ఏజేఎఫ్‌సీఎమ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎ.కృష్ణప్రసాద్ శుక్రవారం తీర్పునిచ్చారు. కొత్తపేట ప్రాంతంలో 2022 ఫిబ్రవరి 14న బుంగా హేమంత్ ఇంటి వద్ద పెట్టిన మోటారు సైకిల్ మాయమైంది. 2022 డిసెంబర్ 18న రాజేంద్రనగర్ గాంధీపురానికి చెందిన అడపా దుర్గాప్రసాద్ ఇంట్లో బీరువా పగులకొట్టి బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, రూ.20 వేల నగదు చోరీ చేశారు. ఈ కేసుల్లో వేమగిరి సత్తిబాబును నిందితుడిగా పోలీసులు గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నిజనిర్ధారణ కావడంతో సత్తిబాబుకు జైలుశిక్ష విధించారు.

ఘనంగా ఫ్యూచర్‌కిడ్స్ వ్యవస్థాపక దినోత్సవం



మొక్క నాటుతున్న డైరెక్టర్ రవిబాబు, చైర్‌పర్సన్ విజయకుమారి

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో విద్యార్థులు 23వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. దీనిలో భాగంగా ఎన్నికలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల కెప్టెన్, వైస్ కెప్టెన్‌లను విద్యార్థులు ప్రత్యక్ష ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఎన్నుకున్నారు. నిజమైన ఎన్నికల తరహాలోనే బ్యాలెట్ పేపర్లు, పోలింగ్‌బూత్‌లు, విద్యార్థుల ప్రచారంతో సందడిగా ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాలలో నూతనంగా నెలకొల్పిన స్పేస్ ల్యాబ్‌ను పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి ప్రారంభించారు. ఈ ల్యాబ్ భూగోళ, ఖగోళ, విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన అనేక విషయాల్ని ప్రత్యక్షంగా అధ్యయనం చేయడానికి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చైర్‌పర్సన్ విజయకుమారి, సీఈవో మహశ్వి, డీన్ హర్షిణి, ప్రిన్సిపాల్ ఎం.శేషగిరిధర్, వైస్ ప్రిన్సిపాళ్లు సైదాభాను, శ్రీవల్లి పాల్గొన్నారు.